క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో జిల్లా పార్టీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు, కొయ్యూరు, చింతపల్లి ఎంపీపీలు

సాక్షి,పాడేరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖలోని ఆయన నివాస గృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు, కొయ్యూరు, చింతపల్లి ఎంపీపీలు రమేష్, అనూషాదేవిలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొయ్యూరు: మండలంలోని బంగారం పేటలో ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫున ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. పలు ఆలయాలకు ఆంజనేయుని ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్నట్టు చెప్పారు. ఆధ్మాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

అరకులోయటౌన్: మండలంలోని శరభగుడ సీబీఎం చర్చి ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరంలో సుమారు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్టు ఏపీ రిటైర్డ్ పెన్షనర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు వి. బాబూరావు తెలిపారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) కంటి వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఐ డ్రాప్స్ అందించారు. శంకర్ ఫౌండేషన్ పెందుర్తి శాఖ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ రిటైర్డ్ పెన్షనర్‌ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బి.ఆనందరావు, కంటి వైద్య నిపుణులు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో సోమవారం వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధి కనకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో రొమ్ము, గర్భకోశ, నోటి క్యాన్సర్‌తో పాటు బిపి, డయాబిటిస్ హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేస్తామన్నారు. అరకులోయ ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉదయం 9 సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి పశువులకు వ్యాక్సినేషన్



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ

దుంబ్రిగుడ: మండలంలోని 18 పంచాయతీల్లో ఈనెల 20 నుంచి పశువులకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్టు మండల పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించి పశువులకు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పంచాయతీ కేంద్రలలో సిబ్బంది పాల్గొవాలన్నారు. సిబ్బంది త్రినాథరావు, సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వ్యవసాయ పనులు

- మెట్ట పంటల్లో కలుపు తొలగింపు
- పనుల్లో గిరిజన రైతులు నిమగ్నం



కలుపు తొలగించిన తరువాత రాగుల సాగు



పన్నెడ గ్రామంలో రాగులు పంటకు కలుపు మొక్కలు తొలగిస్తున్న గిరిరైతులు

పెదబయలు: మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. మెట్ట పంటలకు ఈ వర్షాలు ఎంతోగానో మేలు చేసినట్టు రైతులు చెబుతున్నారు. మండలంలో అత్యధికంగా రాగులు, సామలు, మెట్టు వరి, వేరుశనగ, పసుపు, పిప్పళ్లు, కూరగాయలు ఇతర పంటలకు వర్షాధారంపై ఆధారపడి గిరిజన రైతులు ఏటా సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది మంచి సమయంలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో మెట్ట పంటలకు అనుకూలంగా ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో భూమి మెత్తగా ఉండడంతో పంటల్లో పిచ్చి మొక్కలు(కలుపు) తొలగింపు పనుల్లో రైతులు నిమగ్నయ్యారు. వర్షాలు తగ్గి ఎండ కాస్తే కలుపు తొలగింపునకు ఇబ్బందిగా ఉంటుంది. దీంతో వర్షాలు కురుస్తున్న గిరిజన రైతులు కలుపును తొలగిస్తున్నారు. కలుపు తొలగిస్తే పంట బాగా పెరిగి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.అయితే గతంలో మెట్ట పంట సాగు తక్కువగా ఉండేది.అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసాగా పెట్టుబడి సహాయం ఏటా అందించడంతో సాగు ఎక్కువగా జరిగింది. అయితే ఈ ఏడాది కూటమీ ప్రభుత్వం హామీ ఇచ్చిన నేటి వరకు ఖరీఫ్‌కు ముందుగానే అందించాల్సిన పెట్టుబడి సహాయం అందకపోడంతో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలానే మరి కొద్ది రోజుల పాటు వర్షం పడితే బాగుంటుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 2024 ఖరీఫ్‌లో అన్ని పంటలు కలుపుకుని 7202 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు.మండలంలో 2326 హెక్టార్లలో రాగుల సాగు జరుగుతోంది.అలాగే సామలు 157,కొర్రలు 7 హెక్టర్లలో సాగు జరిగింది.

పెట్టుబడి సాయం అందించాలి



అన్ని పంటల్లో కలుపు మొక్కలు తొలగింపు చాలా అవసరం. వరి, రాగి, సామ, వేరుశనగ పంటలకు ఒక్క సారి కలుపును తొలగించాల్సి ఉంటుంది. పసుపు పంటకు రెండు నుంచి మూడు సార్లు తొలగించాల్సి ఉంటుంది. మన్యంలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల నేల మెత్తబడి కలుపు మొక్కల తొలగింపు పనులు సునాయాసంగా జరుగుతున్నాయి. గత ఐదేళ్లగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం అందించి రైతులను ఆదుకోవాలి.

– బత్తిరి వెంకట్, రైతు, కరుగొండ, పెదబయలు మండలం

కలుపు నివారణే ముఖ్యం



ఏ పంటలు వేసిన కలుపు మొక్కలు పెరడం జరుగుతుంది. దీని తొలగింపుతోనే పంట బాగా పెరిగి దిగుబడి పెరుగుతుంది. అలాగే పంట విస్తీర్ణంలో కలుపు మొక్కల విస్తీర్ణం పెరిగిన కొద్ది పంట దిగుబడి తగ్గుతుంది. ఇక్కడ పూర్తిగా పంట వేసి 45 రోజుల తరువాత నుంచి కలుపు మొక్కలు పూర్తిగా తొలగిస్తారు. కలుపు తొలగించిన తరువాత బాగా బలంగా పెరుగుతుంది.మంచి దిగుబడి వస్తుంది.ప్రస్తుతం కలుపు మొక్కలు తొలగిస్తున్నారు.అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండంతో మెట్ట పంటలకు కలుపు తొలగింపునకు అనుకూలంగా ఉంది. మండలంలో వరి నాట్లు 95 శాతం పూర్తయింది.

–ఎ శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారి, పెదబయలు మండలం

పొంచి ఉన్న ప్రమాదం



కర్రిముఖిపుట్టు వద్ద రహదారిపై ఏర్పడిన గొయ్యి

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గంలో కర్రిముఖిపుట్టు గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద ఏర్పడిన గోతితో వాహనదారులు నిత్యం భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. కల్వర్టుకు రహదారికి మధ్య గోతి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు చేసే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కర్రిముఖిపుట్టు గోతిని పూడ్చాలని పలుమార్లు స్థానికులు అధికారులను కోరారు. కానీ నేటికి పంచాయితీరాజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులతో పాటు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వరద బాధితులకు వితరణ



వరద బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న దాత

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదలకు టేకులబోరు ఎస్సీ కాలనీకి చెందిన వరద బాధితులకు కూనవరం గ్రామస్తుడు కొచ్చర్లకోట సాయి తన వంతు సహాయంగా 30 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు సమకూర్చారు. వాటిని వరద బాధితులకు ఆదివారం పంపిణీ చేశామని గ్రామస్తుడు కొమ్మాని వీర్రాజు తెలిపారు. మండల మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మాని సునీత, వార్డు సభ్యులు పసుపులేటి వీరబాబు, ఎలిపె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ విస్మరించిన కూటమి ప్రభుత్వం

సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు వాణిశ్రీ



మట్ల వాణిశ్రీ

రంపచోడవరం: ఎన్నికల హామీ ప్రకారం గ్రామ, వార్డు వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. వారికి రూ. 10వేలు వేతనం చెల్లించాలన్నారు. దీనిపై ఈ నెల 20న విజయవాడ ఎం.బి. భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు.ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామ వార్డు వలంటీర్లకు ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవటంలో పూర్తిగా విఫలమవుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా వలంటీర్ల పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు వెంటనే పరిష్కారం చేసే దిశగా గ్రామ వలంటీర్లను నియమించిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో మూడు నెలలు వీరిని పక్కన పెట్టారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మరచిపోయి వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నిక హామీ ప్రకారం రూ.10వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 విజయవాడలో జరిగే సదస్సును ఏజెన్సీలోని వలంటీర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీచర్ మృతికి సంతాపం



సత్యనారాయణ (ఫైల్)

కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం ఆశ్రమ బాలుర పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న కంకిపాటి సత్యనారాయణ(56) స్వగ్రామం శరభన్న పాలెంలో మృతి చెందారు. ఆయన మృతికి ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు తదితరులు సంతాపం ప్రకటించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఆరోగ్యంగా ఉన్న సత్యనారాయణ గుండెనొప్పిగా ఉందని చెప్పి హఠాత్తుగా మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సత్యనారాయణ మృతికి హెచ్ఎంతో పాటు సహచర ఉపాధ్యాయులంతా సంతాపం తెలిపారు.

160 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని రామకృష్ణ మిషన్‌లో గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్టు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్లు టీవీ సుబ్బారావు, దాసరి ఉమమహేష్, ఎస్.సంపత్‌కుమార్ పాల్గొని 160 మందికి వైద్య పరీక్ష చేశారు. రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు శ్రీకాంత్, పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరులో వర్షం



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మెరుపులు, ఉరుములు రావడంతో పిడుగులు పడతాయని స్థానికులు భయపడ్డారు. విపత్తల నిర్వాహణ సంస్థ నుంచి కూడా పిడుగులు పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. వర్షం మూలంగా కొయ్యూరు సంతకు వచ్చిన వ్యాపారలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి.

పంట నష్టంతో రైతుల గగ్గోలు



దొరగూడలో పాడైన వరి పంట

ముంచంగిపుట్టు: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంటలు పూర్తిగా పాడైపోయాయని, దీంతో ఆర్థికంగా నష్టపోయామని మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామ గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు పాడైన పంటలపై గిరిజన రైతులు సొంబ్రు, మంగ్ల, సోన్ను, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ భారీ వర్షాలకు వరదనీరు వరి పంట పోలాల్లోకి చేరి, తీవ్రంగా పంటను నాశనం చేవాయన్నారు. అప్పులు చేసుకొని పంటలు వేస్తే, వర్షాల రూపంలో మాకు నష్టాని మిగిల్చాయని, ఆర్థికంగా నష్టపోయామని వారు వాపోయారు. పంటలు పాడైన ఇప్పటివరకు ఏ అధికారి కూడా మా గ్రామానికి వచ్చి, ఎటువంటి భరోసా కల్పించలేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖాధికారులు, ప్రభుత్వం స్పందించి మాకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

కె.కోటపాడు: స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. ఆదివారం చొడువాడ గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నేత్రాలు పదిలం



రెటీనా పరీక్షలు చేయించుకుంటున్న డీజీ నాథ్

పాయకరావుపేట : ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు. ఆదివారం హైమ నేత్రాలయం సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసిన రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైమ నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సీఈవో డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా షుగర్, బీపీ, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల కంటి సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారని అన్నారు. రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు మండలంలో ఉపాధ్యాయులు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడం శుభపరిణామం అన్నారు. డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ షుగర్ వ్యాధి వలన కంటి రెటీనా డిటాచ్మెంట్, రెటీనా హేమరేజ్, డయాబెటిక్ రెటినోపతి వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఏవీ సూర్యనారాయణ, కార్యదర్శి పి.హరికృష్ణ, ఆర్.వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరరావు, టి.తాతారావు, సత్య శ్రీనివాస్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగంగవరంలో తాగునీటి ఇక్కట్లు



తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని దారకొండ పంచాయతీలోని చిన్నగంగవరం గ్రామంలో గిరిజనులు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేరులోనే గంగ నింపుకొన్నప్పటికీ గుక్కెడు తాగునీటికి అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో రక్షిత తాగునీటి పథకాలు పని చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల్లో బురదనీరు వస్తోందని, ఊట కాలువల నుంచి కలుషిత నీటిని సేకరించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమకు తాగునీటి కష్టాలు తీరడం లేదని గ్రామ మహిళలు వాపోతున్నారు.

అంగన్‌వాడీల వేతనాలను విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ సహాయ కార్యదర్శి శంకరరావు.

ముంచంగిపుట్టు: రెండు నెలలుగా వేతనాలు లేక అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి కె.శంకరరావు అన్నారు.మండల కేంద్రంలో స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు అండగా ఉంటామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో గత రెండు నెలలుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతం ఇవ్వలేని పరిస్థితిలో ఉండడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, తక్షణమే యంత్రాంగం స్పందించి బకాయి వేతనాలు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ, అంగన్‌వాడీ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, సత్యవతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతికి ఎమ్మెల్యే సంతాపం



మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ కూడా వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గ్రామానికి వచ్చి మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రి ఎం.మణికుమారి, మాజీ ఎంపీపీ ఎం.వెంకటగంగరాజు(బుజ్జి), లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, వైఎస్సార్‌సీపీ నాయకుడు పండన్న, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోతులో పడి మూగజీవాల మృతి

- ప్రమాదకరంగా మారిన సెల్‌టవర్ల గోతులు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



గోతులో ఇరుక్కుని మృతి చెందిన ఆవు

గూడెంకొత్తవీధి: సెల్‌టవర్ల కోసం తీసిన గోతుల్లో పడి ఊపిరాడక రెండు ఆవులు మృతి చెందిన ఘటన ఆదివారం గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఊబపాలం గ్రామానికి చెందిన కొర్రా బొజ్జన్న అనే గిరిజన రైతుకు చెందిన రెండు దుక్కిటెద్దులు శనివారం మేతకు వెళ్లి వస్తుండగా సెల్ టవర్ల యజమానులు తీసిన గోతుల్లో పడి ఇవి మృతి చెందాయి. లక్షల రూపాయల విలువైన రెండు దుక్కిటెద్దులు ఒకేసారి మరణించడంతో ఆ రైతు ఆవేదన చెందారు. తమకు సెల్ టవర్ల నిర్వాహకుల నుంచి తగిన నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన కోరారు. వివిధ మండలాల్లో సెల్‌టవర్ల కోసం తీసిన గోతుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గిరిజనులు, గిరిజన రైతులు చెబుతున్నారు. పనులు పూర్తయిన తరువాత గోతులు పూడ్చకపోవడంతో మూగజీవాలు అందులో పడి బయటకు రాలేక, ఊపిరాడక మృతి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టెలికాం శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరమణ, పక్కన ఎస్ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పాడేరు అదనపు ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు కొయ్యూరు సంతలో సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకేష్ కుమార్ గంజాయి అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేస్తున్న వారి వివరాలను అందజేసిన వారికి పారితోషకం ఇస్తామని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి మూలంగా యువత జీవితాలు నాశనమై పోతున్నాయని వివరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిస కావద్దన్నారు. గంజాయి నివారణ కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 9381123100 పై అవగాహన కల్పించారు. ఎక్కువ లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలని కోరారు. మొక్కలను ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్మెట్ లేకపోవడంతో కలిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

కోతదశలో బరబాటి పంట



పాతవలసలో పంట

కె.కోటపాడు: మండలంలో బరబాటి పంట కోత దశకు చేరుకుంది. తక్కువ పెట్టుబడితోపాటు స్వల్పకాల వ్యవధిలో చేతికంది వచ్చే పంట కావడంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పంటకు ఎనిమిది వేల రూపాయల వరకూ ఖర్చవుతుందని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో లాభదాయకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మర్రివలస, లంకవానిపాలెం, పింద్రంగి, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 50 ఎకరాల్లో పంట కోత దశకు చేరుకుంది.

కృష్ణాష్టమి ఉత్సవాలు ప్రారంభం

కశింకోట: కోనేటి పార్కు వద్దనున్న శ్రీ కృష్ణ మందిరంలో యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవర వీధి నుంచి శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి మందిరంలో నెలకొల్పారు. ప్రత్యేక పూజలు చేశారు.